# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

సోమవారం 15, డిసెంబర్ 2025


## ప్రశాంతంగా కొనసాగిన 2వ విడత పంచాయితీ ఎన్నికలు

**✳ మంచిర్యాల జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్**




నస్పూర్, ప్రభాతవార్త

2వ సాధారణ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో 2వ విడత సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో కొనసాగాయని మంచిర్యాల జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. ఆదివారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో ఏర్పాటు చేసిన సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వెబ్ కాస్టింగ్ ద్వారా పోలింగ్ సరళి, కౌంటింగ్ ప్రక్రియను అదనపు ఎన్నికల అధికారి, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్ రావు తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 2వ సాధారణ పంచాయతీ ఎన్నికలు 2025లో భాగంగా 2వ విడతలో జిల్లాలోని బెల్లంపల్లి, భీమిని, కన్నెపల్లి, నెన్నెల, కాసిపేట, తాండూర్, వేమనపల్లి మండలాలలో సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా నిర్వహించాలని తెలిపారు. జిల్లాలో గుర్తించిన సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించి వెబ్ కాస్టింగ్ ద్వారా పర్యవేక్షించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా 2వ విడత..





ఆసిఫాబాద్ డిసెంబర్ 14, ప్రభాతవార్త

రెండో సాధారణ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో రెండవ విడత ఎన్నికల నిర్వహణ జిల్లాలో ప్రశాంతంగా జరిగే విధంగా చర్యలు తీసుకోవడం జరిగిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సమీకృత మిగతా 2లో..

## గ్రామాలు బాగు పడాలంటే
# బిజెపితోనే సాధ్యం

**✤ ఎంపీ గోడం నగేష్**



బజార్‌హత్నూర్, ప్రభాతవార్త:

గ్రామాలు బాగు పడాలంటే బిజెపితోనే సాధ్యమని ఎంపీ గోడం నగేష్ అన్నారు. మండల కేంద్రంలోని మూడవ విడత ప్రచారం జోరుగా సాగుతోంది. ప్రచారంలో భాగంగా ఆదివారం ఆదిలాబాద్ ఎంపి గోడం నగేష్ బజార్‌హత్నూర్ బిజెపి కార్యాలయంలో కార్నర్ మీటింగ్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బిజెపి పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి సీడం వికాస్‌ను సర్పంచ్‌గా గెలిపించాలని గ్రామస్తులకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ఉపాధి హామీ, రేషన్ బియ్యం లాంటి నిధులు కేంద్రం నుండే వస్తున్నాయని ఆయన గుర్తు చేశారు. బిజెపి పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపిస్తే వారికి నేను కూడా అండగా ఉండి కేంద్రం నుంచి వచ్చే నిధులను కూడా సహకరిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు అల్కే గణేష్, నాణెం రమణ, కొత్త శంకర్, సూది నంది నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీ ఎన్నికల్లో గెలుపెవరిది..?






★ స్వతంత్ర అభ్యర్థులకు పట్టం కట్టేనా

★ బినామీలో సునామి ఎవరు

★ దళిత బంధు తిన్నవారికి దడ పుట్టించేనా?

బోథ్, డిసెంబర్ 14, ప్రభాతవార్త:

ఏళ్ల తరబడి ఎదురుచూసిన స్థానిక సంస్థల ఎన్నికల్లో బోథ్ ఎస్సీ రిజర్వేషన్ రావడంతో వెనుకబడిన తరగతులలో ఉత్సాహాన్ని తెచ్చింది. నవంబర్ 3 నుంచి మొదలైన నామినేషన్ ప్రక్రియ జోరందుకున్నాయి. వివిధ పార్టీలకు చెందిన అభ్యర్థులు అలాగే స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్లు వేసి పంచాయతీ ఎన్నికలల్లో తమ సత్తా చాటడానికి బరిలో నిలిచారు. అయితే మండలంలో రిజర్వేషన్ ఖరారు కాక మునుపు జనరల్ వస్తుందని అనుకున్న కొందరు ఆశావాహులు సామాజిక సేవలో డబ్బులు ఖర్చు పెట్టి ఉండడం తీరా ఎలక్షన్ల సమయంలో ఎస్సీ రిజర్వేషన్ రావడంతో తమ ఆశలు వదులుకోవడంతోపాటు పార్టీ అభ్యర్థులకు మద్దతు తెలుపుతూ అభ్యర్థులను ప్రచారంలో ముందుకు తీసుకెళుతున్నారు. కొందరు ఎలాగైనా కుర్చీని దక్కించుకోవాలని విశ్వ ప్రయత్నాలు చేస్తూ బినామీలుగా వ్యవహరిస్తున్నారు. అయితే బోథ్ మేజర్ గ్రామపంచాయతీ కావడంతో అందరి కళ్ళు సర్పంచు కుర్చీ వైపే ఉండటం గమనార్హం.

2లో..

## పోలింగ్ కేంద్రాలను పర్యవేక్షించిన
# జిల్లా కలెక్టర్, ఎస్పీ



సారంగాపూర్, ప్రభాతవార్త:

సారంగాపూర్ మండలంలోని ధని, రాణాపూర్ గ్రామంలోని పోలింగ్ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, ఎస్పీ జానకి షర్మిల సంయుక్తంగా కలసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన భద్రతా ఏర్పాట్లు, పోలింగ్ ప్రక్రియ నిర్వహణ తీరును పరిశీలించి, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని అధికారులకు, సిబ్బందికి సూచనలు చేశారు. ఓటర్లు స్వేచ్ఛగా, తమ ఓటు హక్కును వినియోగించుకునేలా అన్ని ఏర్పాట్లు చేశామని అన్నారు. వారి వెంట ఎంపీడీవో లక్ష్మీ కాంతారావు, తహశీల్దార్ సంధ్యారాణి, ఎస్సై శ్రీకాంత్ సంబంధిత పోలీసు అధికారులు, ఎన్నికల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ప్రశాంతంగా 2వ విడత..

(మొదటిపేజీ తరువాయి)

జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో రెండవ విడతలో జరుగుతున్న సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల పోలింగ్ సరళిని ఎన్నికల సాధారణ పరిశీలకులు శ్రీనివాస్ తో కలిసి వెబ్ కాస్టింగ్ ద్వారా పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రెండవ విడతలో భాగంగా 6 మండలాలలో గల గ్రామపంచాయతీల సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాల ఎన్నికలకు 131258 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారని, పోలింగ్ కేంద్రాలలో వరుస క్రమంలో ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకునే విధంగా క్యూ లైన్స్ ఏర్పాటు చేసి తగు చర్యలు తీసుకోవాలని ఎన్నికల అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎన్నికల అధికారి, జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతి గౌడ్, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# పంచాయతీ ఎన్నికల్లో గెలుపెవరిది..?

(మొదటిపేజీ తరువాయి)

అభ్యర్థులు ఎందరైన గెలిచి నిలిచేది ఒక్కరే ఆ ఒక్కరు ఎవరు అనేది 17న ఓటర్లు భవితవ్యం తేల్చనున్నారు. కోడి కూతకు ముందే ప్రచార రథాలు ప్రచారానికి రయ్యా రయ్యా మంటూ గల్లీలలో దూకుడుతో దూసుకెళ్తున్నాయి. ప్రచారానికి తిరిగే కొందరు ప్రజలకు చేరువకాని నాయకులు ఉచిత హామీలు, మునుపెన్నడు చేయని విధంగా సేవలు చేసినట్లు పాటల రూపంలో హోరెత్తిస్తున్నారు. అలాంటి నాయకులకు చేదు అనుభవలు ఎదురయ్యే అవకాశాలే ఎక్కువ అయితే ఎన్నికల్లో డబ్బులు ఖర్చు పెట్టి గెలిచిన అభ్యర్థులు ఆ డబ్బుకు రెట్టింపు ఏలా రాబట్టాలో రాత్రి పగలు తేడా లేకుండా మునిగిపోయేంతగా అవకాశము లేకపోలేదు! తీరా నిండుకుండ నిండే సరికి ఐదేళ్ల పాలన ముగుస్తుంది. ప్రజలు వెనక్కి తిరిగి చూసేసరికి గ్రామ అభివృద్ధికి తోడ్పడతానన్న అభ్యర్థులు కనుల ముందు కనిపించరు అదే ఒక మంచి వ్యవస్థ కావాలంటే ఆర్థిక ప్రలోభాలకు లొంగకుండా ప్రజలతో మమేకమై ప్రజలకు సేవకుడిగా ఉండే అభ్యర్థిని ఎన్నుకోవడం ద్వారా గ్రామాభివృద్ధి మెరుగుపడుతుంది. అయితే ప్రచారంలో అభ్యర్థులతో తిరుగుతున్న వారికి దినసరి కూలీగా డబ్బులు చెల్లిస్తున్నారు. ఎన్నికల్లో నిబంధనను అనుసరించి ఖర్చు మాత్రమే చేయాలి అని నిబంధనకు తూర్పు పడుతున్నాయేమో? అభ్యర్థులు ఖర్చు చేసిన డబ్బులు ఎందులోకి వస్తాయి అనేది ప్రజలకు ప్రశ్నగా మిగిలింది. ఏది ఏమైనా ఓటును నోటుతో కొనవద్దు ఓటరు ఓటుతో సమాధానం చెప్పాలి. అభివృద్ధి కావాలంటే అందుబాటులో ఉన్న నాయకుడు కావాలి ఏ ప్రలోభాలకు లొంగకుండా ఓటరు తమ ఓటుతో సేవకుడిని ఎన్నుకుంటారో ప్రలోభాలకు లొంగి అభివృద్ధిని దూరం చేసుకుంటారో ఓటరు నిర్ణయం పై ఆధారపడనుంది.

# ఈస్గాం శివాలయంలో భక్తిశ్రద్ధలతో షష్టిబోనాలు

## – స్వామివారికి బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్న భక్తులు

**కాగజ్‌నగర్ రూరల్, ప్రభాతవార్త :**

కాగజ్‌నగర్ మండలంలోని ఈస్గాం శివ మల్లన్న స్వామి దేవాలయంలో మార్గశిర మాసం షష్టి బోనాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. చివరి ఆదివారం కావడంతో కాగజ్‌నగర్, ఆసిఫాబాద్, కౌటాల, దహెగాం, బెజ్జూర్, పెంచికల్‌పేట్, రెబ్బెన, తాండూర్‌తో పాటు వివిధ ప్రాంతాల నుండి భక్తులు కుటుంబ సమేతంగా దేవాలయానికి తరలి వచ్చారు. ఉదయం నుండే భక్తుల తాకిడి ప్రారంభమైంది. దేవాలయ పరిసర ప్రాంతంలో కొత్త బియ్యం మరియు బెల్లంతో నైవేద్యం తయారు చేసుకుని స్వామివారికి బోనము సమర్పించుకొని మొక్కుబడులు చెల్లించుకున్నారు. దర్శనానంతరం బోనాలకు ప్రత్యేక అలంకరణ చేసి ఒగ్గు పూజారులతో బండారి పూజలు చేయించి స్వామివారికి నైవేద్యం సమర్పించారు. ఈ సందర్భంగా భక్తులకు త్రాగునీటి సౌకర్యము, తాత్కాలిక వసతి దర్శనార్థం, ప్రత్యేక క్యూ లైన్లు ఏర్పాటు చేయడం జరిగిందని ఆలయ కార్యనిర్వాహణాధికారి వేణుగోపాల్ గుప్తా తెలిపారు. భక్తులకు ప్రైమరీ హెల్త్ సెంటర్ ఇస్గాం ఆధ్వర్యంలో ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేశారు. కాగజ్‌నగర్ రూరల్ సిఐ కుమారస్వామి ఆదేశాల మేరకు ఇస్గాం ఎస్సై కళ్యాణ్ ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా వాహనముల పార్కింగ్, ట్రాఫిక్ కంట్రోల్ చేయడంతో పాటు భక్తుల భద్రత చర్యలను, దేవాలయం వద్ద ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు సిబ్బందితో తగు బందోబస్తు ఏర్పాటు చేశారు. భక్తులకు త్రాగునీటి సౌకర్యం కోసం ఈస్గాం గ్రామపంచాయతీ, కాగజ్నగర్ పట్టణ మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో వాటర్ ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసినారు శివమల్లన్న సేవా సమితి ఈస్గాం గ్రామం సేవకులు, శ్రీ అరుణోదయ విద్యాలయం కాగజ్‌నగర్ విద్యార్థులు భక్తులకు దర్శన సౌకర్యార్థము, ఎలాంటి ఇబ్బందులు కల్గకుండా క్యూలైన్ల క్రమబద్ధీకరణ, త్రాగునీటి సరఫరా సేవలను అందించారు.



# ప్రజల తీర్పుతో సర్పంచ్ పీఠాలపై కొత్త నాయకత్వం

**పెంచికల్ పేట్, డిసెంబర్ 14, ప్రభాతవార్త**

రెండో విడతలో భాగంగా ఆదివారం పెంచికల్ పేట్ మండలంలో జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్, బిఆర్ఎస్, బిజెపి పార్టీల అభ్యర్థులు స్పష్టమైన అధిక్యంతో విజయం సాధించారు. మండలంలోని పెంచికల్ పేట్, అగర్గుడ గ్రామల్లో కాంగ్రెస్ పార్టీ తరుపున బరిలోకి దిగిన అల్లూరి రాజేశ్వరి, షేక్ ఉస్మాన్ మురళీగూడ, పోతేపల్లి, లోడ్ పల్లి గ్రామల్లో బిఆర్ఎస్ అభ్యర్థులు వెంకటేష్, పోషన్న, సుజాత శ్రీనివాస్, బిజెపి నుండి కొండపల్లి బొంబాయి గూడా గ్రామాల్లో అన్నం రుకుంబాయి, ఉమా, సర్పంచులుగా ఎన్నికై తమ సత్తా చాటారు. గ్రామభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, పారదర్శక పాలన వంటి హామీలతో ఓటర్లను అక్కట్టున్నారు. గెలపొందిన సర్పంచులకు మద్దతుదారులు, పార్టీ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. గ్రామాల అభివృద్ధి కోసం కలిసి పని చేస్తామని ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని నూతంగా ఎన్నికైన సర్పంచులు ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

# ప్రశాంతంగా ముగిసిన గ్రామపంచాయతీ ఎన్నికలు

## తాండూర్ మండలంలో 78.52 శాతం పోలింగ్ నమోదు

**తాండూర్, డిసెంబర్ 14, ప్రభాతవార్త :**

మండలంలోని 15 గ్రామ పంచాయతీలలో ఆదివారం ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. మండలంలో మొత్తం 27757 మంది ఓట్ల గాను 21794 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఉదయం ఏడు గంటలకు పోలింగ్ ప్రారంభం అయినప్పటికీ చలి తీవ్రత వలన 9 గంటల వరకు పోలింగ్ మందకొడిగా సాగింది. 9 గంటల తర్వాత ఓటర్లు తరలి రావడంతో పలు పోలింగ్ కేంద్రాల వద్ద ఓటు వేసేందుకు బార్లు తీరారు. పోలింగ్ కేంద్రాలకు 100 మీటర్ దూరంలో ప్రధాన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభ్యర్థులు తమ అభ్యర్థి పలానా గుర్తుకు ఓటు వేయాలని ప్రచారం చేశారు. బోయపల్లి కేంద్రాన్ని రామగుండం సిపి కిషోర్ ఝా, అచ్చలాపూర్, మాదారం పోలింగ్ కేంద్రాలను బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, తహసిల్దార్ జ్యోత్స్న, ఎంపీడీవో శ్రీనివాస్, తాండూర్ పోలింగ్ కేంద్రాన్ని మంచిర్యాల డిసిపి ప్రకాష్, తంగళ్ళపల్లి పోలింగ్ కేంద్రాన్ని జిల్లా అదనపు ఎన్నికల అధికారి వెంకటేశ్వరరావు సందర్శించి ఓటింగ్ ప్రక్రియ, ఎన్నికల ఏర్పాట్లను పరిశీలించి ఎన్నికల అధికారులకు, పోలీసు సిబ్బందికి పలు సూచనలు చేశారు. తాండూర్ తహసిల్దార్ జ్యోత్స్న, మండల ఎన్నికల సహాయ అధికారి, ఎంపీడీవో శ్రీనివాస్ పోలింగ్ ప్రక్రియను ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. పోలింగ్, కౌంటింగ్ సందర్భంగా ఎలాంటి అల్లర్లు, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తాండూర్, మాదారం ఎస్సైలు కిరణ్ కుమార్, సౌజన్య ఆధ్వర్యంలో పలువురు ఎస్సైలు, ఏఎస్సైలు, పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

# నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులకు సన్మానం

**ఆసిఫాబాద్, డిసెంబర్ 14, ప్రభాతవార్త:**

తొలి విడత ఎన్నికల్లో భాగంగా లింగాపూర్ మండలంలోని చోర్ పల్లి, పిట్టగూడ గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎన్నికలలో విజయం సాధించిన ప్రజాప్రతినిధులను ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవాలక్ష్మి సన్మానిచ్చారు. ఆదివారం జిల్లాకేంద్రంలోని స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నూతన సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, వార్డ్ మెంబర్‌లు ఎమ్మెల్యే ను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం, ఎన్నికల్లో విజయం సాధించిన నూతన ప్రజాప్రతినిధులను ఎమ్మెల్యే శాలువాలతో సన్మానించి, శుభాకాంక్షలు తెలిపి స్వీట్స్ తినిపించారు. ఈ కార్యక్రమంలో లింగాపూర్ లక్యా నాయక్, కిషన్, నాగోరావు, కొండు మారుతీ పటేల్, జంగు, మనోహర్, దస్రు, ప్రేమ్ కుమార్, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



స్వీట్స్ తినిపిస్తున్న ఆసిఫాబాద్ ఎమ్మెల్యేకోవ లక్ష్మి



మాదారం పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్



ఓటు వేసేందుకు చంటి పిల్లతో వచ్చిన మహిళ



సర్టిఫికెట్ అందుకుంటున్న చంద్రమోహన్ గౌడ్

## లయన్స్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ సర్టిఫికెట్ అందుకున్న లయన్ డాక్టర్ చంద్రమోహన్ గౌడ్ ఉదారి

మంచిర్యాల, డిసెంబర్ 14, ప్రభాతవార్త

ఇంటర్నేషనల్ మొదటి వైస్ ప్రెసిడెంట్ లయన్ మార్క్ ఎస్ లియాన్, వారి సతీమణి కారోలిన్,భారత దేశ పర్యటనలో భాగంగా శనివారం సాయంత్రం హైద్రాబాద్‌లో నిర్వహించిన గ్యాట్ లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్‌లో భాగంగా 2025,26 సంవత్సరనికి గాను జిల్లా 320 జిఎల్‌సిఐఎఫ్ కోఆర్డినేటర్‌గా సేవలు అందిస్తున్న చంద్రమోహన్ గౌడ్‌కి ఇంటర్నేషనల్ ప్రెసిడెన్షియల్ సర్టిఫికేట్‌ని అందచేశారు. ఈ కార్యక్రమంలో పాస్ట్ ఇంటర్నేషనల్ డైరెక్టర్స్ లయన్ సునీల్ కుమార్, బాబు రావు జిల్లా గవర్నర్ లయన్ సింహరాజు కోదండరాం అభినందించారు.



## బిజెపిలో పట్టణ యువకుల చేరికలు

లక్షెట్టిపేట, డిసెంబర్ 14, ప్రభాతవార్త

బిజెపి ప్రభుత్వాన్ని ప్రజలు కోరుకుంటున్నారని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘునాథ్ అన్నారు. ఆదివారం లక్షెట్టిపేట మున్సిపాలిటీ పరిధిలోని అంకతివాడకు చెందిన పలువురు యువకులు ఆయన సమక్షంలో పార్టీలో చేరారు. వారికి కండువాలు కప్పి బిజెపిలోకి ఆహ్వానించారు. లక్షెట్టిపేట మున్సిపాలిటీ అధ్యక్షుడు వీరమల్ల హరి గోపాల్ రావు, జనరల్ సెక్రటరీ సామ వెంకటరమణ, పార్టీలో చేరిన యువకులు మహేష్ తదితరులు ఉన్నారు.

## కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థి మాసు శ్రీనివాస్‌ను గెలిపించాలి

### - శ్యామ్ గౌడ్

రామకృష్ణాపూర్, డిసెంబర్ 14, ప్రభాతవార్త

చెన్నూర్ నియోజకవర్గం కార్మిక ఉపాధి శాఖ మంత్రి. గడ్డం వివేక్ వెంకటస్వామి కాంగ్రెస్ పార్టీ బలపర్చుతున్న బొక్కల గుట్ట గ్రామపంచాయతీ అభ్యర్థిగా పోటి చేస్తన్న మాసు శ్రీనివాస్‌ను గెలిపించాలని పెద్దపల్లి పార్లమెంట్ అధ్యక్షుడు,ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు దీకొండ శ్యామ్ గౌడ్ కోరారు. ఆదివారం బొక్కల గుట్ట గ్రామ పంచాయతీలో మాజీ ఎం.పి.పి బోలిశెట్టి కనకయ్య తో కలిసి ఫుట్ బాల్ గుర్తుకుమీ అమూల్యమైన ఓటు వేసి మాసు శ్రీనివాస్‌ను గెలిపించాలని గడప గడపకు వెళ్లి ప్రచారం చేశారు. కాంగ్రెస్ కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొని విస్తృత ప్రచారం చేశారు.



# సింగరేణిలో సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

★ యాజమాన్యం మొండి వైఖరి వీడాలి ★ ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్

నస్పూర్, డిసెంబర్ 14, ప్రభాతవార్త

సింగరేణి సంస్థలో దీర్ఘకాలంగా పేరుకుపోయిన కార్మిక సమస్యలను యాజమాన్యం తక్షణమే పరిష్కరించాలని ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ బి. జనక్ ప్రసాద్ డిమాండ్ చేశారు. ఆదివారం నస్పూర్ ప్రెస్ క్లబ్‌లో శ్రీరాంపూర్ ఏరియా వైస్ ప్రెసిడెంట్ జెట్టి శంకర్ రావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సింగరేణి యాజమాన్యం కార్మికుల పట్ల అవలంబిస్తున్న మొండి వైఖరిని, తీసుకుంటున్న అన్యాయమైన నిర్ణయాలను తీవ్రంగా ఖండించారు. ప్రస్తుతం సంస్థలో ఉన్న గుర్తింపు సంఘం కారణంగా కార్మికులు కొత్త హక్కులను సాధించుకోలేకపోగా, ఇదివరకే ఉన్న హక్కులను కూడా కోల్పోయే దుస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు. మెడికల్ బోర్డు ఏర్పాటులో జరుగుతున్న జాప్యం, 150 మస్టర్ల నిబంధన పేరుతో జారీ చేసిన సర్క్యులర్, అశాస్త్రీయమైన బదిలీల విధానం వంటి నిర్ణయాలు కార్మికులను నేరుగా ఇబ్బందులకు గురిచేస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ నిర్ణయాలను యాజమాన్యం వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యల పరిష్కారం కోసం ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో ఉద్యమ కార్యాచరణను రూపొందిస్తామని హెచ్చరించారు. అలాగే, ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల విధుల్లో పాల్గొన్న సింగరేణి సిబ్బందికి సెలవు దినాలుగా కాకుండా, విధి నిర్వహణలో ఉన్నట్లుగా పరిగణిస్తూ ఆన్ డ్యూటీ మంజూరు చేయాలని యాజమాన్యాన్ని కోరారు. యూనియన్ బలోపేతం ద్వారా కార్మికుల హక్కులను మరింత కట్టుదిట్టంగా రక్షి స్తామని జనక్ ప్రసాద్ స్పష్టం చేశారు. ముఖ్యంగా కార్మికుల సొంత ఇంటి కలను సాకారం చేయడం, అలవెన్సుల రూపంలో వచ్చే ఆదాయంపై పన్ను మాఫీ చేయించడం, కార్మికులకు న్యాయసమ్మతమైన ఇతర సంక్షేమ పథకాల అమలు వంటి కీలక డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. అవి త్వరితగతిన అమలయ్యేలా చర్యలు తీసుకుంటామని కార్మికులకు హామీ ఇచ్చారు. రాబోయే గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఐఎన్‌టీయూసీ విజయానికి ప్రతి కార్యకర్త బాధ్యతాయుతంగా పనిచేయాలని, ఐఎన్‌టీయూసీని గెలిపించుకోవడం ద్వారానే కార్మిక హక్కులు సాధ్యమని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఐఎన్‌టీయూసీ కేంద్ర సీనియర్ ఉపాధ్యక్షులు, కాంపెల్లి సమ్మయ్య, ఉపాధ్యక్షులు శ్యామ్, ప్రధాన కార్యదర్శి రవీంద్ర రెడ్డి, నాయకులు గరిగె స్వామి, భీమ్ రావ్, చందు, మనోజ్ తదితరులు పాల్గొన్నారు. నాయకుల, కార్యకర్తలు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న జనక్ ప్రసాద్

## తెలంగాణ పోలీస్.. మీ పోలీస్ అని నిరూపించిన సీఐ

### విద్యుత్ ప్రమాదాన్ని తక్షణమే స్పందించి సమస్యను పరిష్కరించిన పట్టణ పోలీసులు

నిర్మల్ పట్టణం, ప్రభాతవార్త



విద్యుత్ విద్యుత్ ప్రమాదం జరగకుండా తక్షణమే స్పందించిన నిర్మల్ పట్టణ సిఐ ప్రవీణ్ కుమార్ సమస్యను పరిష్కరించారు. పట్టణంలోని శరద్ మహల్ కాలనీలోని విద్యుత్ స్తంభానికి మంటలు చెలరేగుతుండగా అటువైపు వస్తున్న జుబేర్ అలీ చూసి సమస్యపై విద్యుత్ అధికారులకు సమాచారం ఇవ్వడానికి ప్రయత్నించగా అందుబాటులో లేకపోవడంతో వెంటనే పట్టణ సిఐకి సమాచారం అందించడంతో సిఐ ఆదేశాల మేరకు ఎస్సై రమేష్, సిబ్బందితో తక్షణమే సంఘటన స్థలానికి చేరుకొని సమస్యను పరిష్కరించడంతో కాలనీవాసులు ఊపిరి పీల్చుకున్నారు.. విద్యుత్ అధికారుల నిరక్ష్యంతో ఇలా జరిగిందని, కొంచెం కూడా నిరక్ష్యం వహిస్తే ఎంతో పెద్ద ప్రమాదం జరిగేదని కాలనీవాసులు తెలిపారు. రాత్రి ఒంటిగంట కూడా సమస్యపై స్పందించి సమస్యను పరిష్కరించిన పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్‌ను, ఎస్సై ఎస్సై రమేష్, పోలీస్ సిబ్బందిని కాలనీవాసులు అభినందించారు. ఇకనైనా సంబంధిత అధికారులు నిరక్ష్యం వహించకుండా కాలనీలో ఎక్కడైనా సమస్యలు ఉంటే తెలుసుకొని వెంట వెంటనే పరిష్కరించాలని కోరారు.

## ఓటు వేసి గెలిపించండి నర్వ గ్రామాన్ని అభివృద్ధి చేస్తా

జైపూర్, డిసెంబర్ 14, ప్రభాతవార్త



ఈనెల 17న జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ స్థానిక మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి ఆశీర్వాదంతో నర్వ గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని తనకు సంపూర్ణ మద్దతు ప్రకటించి గ్రామ అభివృద్ధికి సహకరించాలని గోదరి లావణ్య గ్రామ ఓటర్లను అభ్యర్థించారు.ఆదివారం ఆమె వార్డ్‌లలో భర్త గోదరి విజయ్‌తో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తనకు ఓటు వేసి గెలిపిస్తే నర్వ గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు.గ్రామం లోకాంగ్రెస్ పార్టీచేసిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారు. గ్రామంలోని సమస్యలన్నీ పరిష్కరిస్తాననీ ప్రధాన రహదారి నుండి గ్రామం లోకి రోడ్ వేసి లైటింగ్ ఏర్పాటు చేస్తానని అన్నారు. కత్తెర గుర్తుకు ఓటు వేసి మెజార్టీతో గెలిపించాలని లావణ్య కోరారు.

## ఆడే గజేందర్‌ను కలిసిన సిరికొండ ప్రజాప్రతినిధులు

సిరికొండ, డిసెంబర్ 14, ప్రభాతవార్త:



బోథ్ నియోజకవర్గ ఇంచార్జి ఆడే గజేందర్‌ను నూతనంగా ఎన్నికైన సిరికొండ సర్పంచ్ బొడ్డు దత్తాత్రి, ఉప సర్పంచ్ తోకల రాజు, వార్డ్ మెంబర్లు షేక్ ఇమామ్, కస్బె రామారావు, బియ్యల రాజేశ్వర్, గొర్బండ్ సందీప్, షేక్ ఆన్సర్ బీ ముక్రం, మాజి జడ్పీటీసీ కుంరం చంద్రకళ-రఘరామ్, మండల అధ్యక్షుడు షేక్ ఇమామ్ మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం నూతనంగా ఎన్నికైన ప్రతినిధులకు ఆడే గజేందర్‌కు శాలువాతో సత్కరించారు. అనంతరం గ్రామ సమస్యలపై చర్చించారు. సిరికొండ గ్రామాన్ని అభివృద్ధిలో ముందుకు తీసుకెళ్లాలని, ఇందిరమ్మ ఇండ్ల సాధన కోసం మరింత కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, పటేల్‌లు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఉమ్మడి నార్నూర్ మండలంలో కాంగ్రెస్ శ్రేణుల పర్యటన

నార్నూర్, డిసెంబర్ 14, ప్రభాతవార్త:

నార్నూర్, గదిగూడ మండలాల్లో ఆదిలాబాద్, ఆసిఫాబాద్ జిల్లాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నరేష్ జాదవ్, ఆత్రం సుగుణలు ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన సర్పంచులను సన్మానించి అభినందనలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పథకాలకు ప్రజాధరణ లభించిందని అన్నారు. గ్రామభివృద్ధికి కృషి చేయాలనీ నూతన సర్పంచులకు సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ సోయం బాపూరావ్, నియోజకవర్గ ఇంచార్జ్ శ్యామ్ నాయక్, సర్పంచుల సంఘం రాష్ట్ర కార్యదర్శి బానోత్ గజానంద్ నాయక్, మాజీ జడ్పీటీసీ హేమలత బ్రీజులాల్, మండల అధ్యక్షుడు దేవరావ్, దళిత రత్న కోర్రల మహేందర్, అరికిళ్ల దశరథ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# మార్కెట్ వ్యాపార సంఘ అధ్యక్ష పీఠం ఎవరిదీ

## తమ్మిశెట్టి విజయ్, మాయ రమేష్ మధ్య ఉత్కంఠ భరిత పోరు



**మందమర్రి, డిసెంబర్ 14, ప్రభాతవార్త**

మంచిర్యాల జిల్లా మందమర్రి మార్కెట్ వ్యాపార సంఘ అధ్యక్ష పదవికి డిసెంబర్ 20 న ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో మార్కెట్ వ్యాపార వర్గాల్లో ఆసక్తి పెరిగింది. ఈ ఎన్నికల్లో తమ్మిశెట్టి విజయ్, మాయ రమేష్‌లు అభ్యర్థులుగా బరిలోకి దిగడంతో పోటీ ఉత్కంఠభరితంగా మారింది. మార్కెట్ వ్యాపారుల రోజువారీ సమస్యలు, మార్కెట్ అభివృద్ధి, పారిశుధ్య నిర్వహణ, రహదారి సౌకర్యాలు, శాశ్వత మౌలిక వసతుల ఏర్పాటు వంటి కీలక అంశాలపై నిర్ణయాలు తీసుకునే అధికారిక బాడీ కావడంతో మార్కెట్ వ్యాపార సంఘ ఎన్నికలకు ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ నేపథ్యంలో ఇరు అభ్యర్థులు వ్యాపారుల మద్దతు కోసం ప్రచారాన్ని ముమ్మరం చేశారు. మందమర్రి మార్కెట్ వ్యాపార కమిటీ ఎన్నికల ప్రక్రియ వేగం పుంజుకుంది. స్థానిక వ్యాపారులు, మార్కెట్ యూనిట్ల సభ్యులు, వ్యాపార సంఘ నాయకులు ఎన్నికలపై ప్రత్యేక దృష్టి సారించడంతో ప్రాంతమంతా ఎన్నికల వాతావరణం నెలకొంది. ఈసారి ఎన్నికలను పారదర్శకంగా, శాంతియుతంగా నిర్వహించేందుకు ఎన్నికల నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. తమ్మిశెట్టి విజయ్ గతంలో రెండు పర్యాయాలు మార్కెట్ వ్యాపార సంఘ అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహించారు. అదే సమయంలో మాయ రమేష్ ఒక పర్యాయం వైస్‌ప్రెసిడెంట్‌గా పనిచేశారు. ఇరు అభ్యర్థులకూ సంఘ కార్యకలాపాలపై అనుభవం ఉండటంతో పోటీ మరింత ఆసక్తికరంగా మారింది. మార్కెట్ వ్యాపార సంఘంలో మొత్తం 477 మంది సభ్యులు ఉండగా, 239 ఓట్లు సాధించిన అభ్యర్థి విజేతగా నిలవనున్నారు. దీంతో ప్రతి ఓటు కీలకంగా మారింది. ఎన్నికల ప్రచారం సార్వత్రిక ఎన్నికలను తలపించే విధంగా సాగుతోంది. నువ్వా నేనా అన్న రీతిలో ఇరు అభ్యర్థులు తమదైన శైలిలో ప్రచారం నిర్వహిస్తూ వ్యాపారుల మద్దతు కూడగట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. గెలుపు సాధిస్తే మార్కెట్ అభివృద్ధి, వ్యాపారుల సమస్యల పరిష్కారానికి పూర్తి స్థాయిలో కృషి చేస్తామని ఇరు అభ్యర్థులు హామీ ఇస్తున్నారు.



### వ్యాపారుల్లో ఆసక్తి-ఆత్రుత

మందమర్రి ప్రాంతంలో వందలాది మంది చిన్న, మధ్యతరహా వ్యాపారులు ఉన్నారు. మార్కెట్ భవిష్యత్తును ప్రభావితం చేసే కమిటీ ఎన్నికలు కావడంతో యువ వ్యాపారులు, సీనియర్ వ్యాపారస్తులు, మహిళా వ్యాపార ప్రతినిధుల వరకు అందరిలో ప్రత్యేక ఆసక్తి నెలకొంది. మందమర్రి మార్కెట్ వ్యాపార కమిటీ ఎన్నికలు కేవలం ఒక ఎన్నిక మాత్రమే కాకుండా మార్కెట్ అభివృద్ధి, వ్యాపారుల సంక్షేమం, భవిష్యత్ ప్రణాళికలను నిర్ణయించే కీలక ప్రజాస్వామ్య ప్రక్రియగా మారాయి. ఎన్నికలు న్యాయంగా, పారదర్శకంగా, శాంతియుతంగా జరగాలని వ్యాపార వర్గాలు ఆకాంక్షిస్తున్నాయి. ఈసారి మందమర్రి మార్కెట్ వ్యాపారస్తులు ఎవరి తలపై కిరీటం ఉంచుతారో తెలియాలంటే ఫలితాల వరకు వేచి చూడాల్సిందే.

## మండలంలో ప్రశాంతంగా ముగిసిన పంచాయతీ ఎన్నికలు

### - పలు కౌంటింగ్ కేంద్రాలను పరిశీలించిన అదనపు కలెక్టర్ చంద్రయ్య

**వేమనపల్లి, డిసెంబర్ 14, ప్రభాతవార్త**

వేమనపల్లి మండలంలోని 14 పంచాయితీలలో ఆదివారం జరిగిన రెండవ విడత పంచాయితీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిసాయి. ఉదయం 7గంటల నుంచి గ్రామ పంచాయితీలలో తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చారు. 14 గ్రామ పంచాయితీలలో నిర్వహించిన 2వ సాధారణ ఎన్నికలకు అధికారులు ముందుగానే అన్ని ఏర్పాట్లు చేయడంతో పోలింగ్ కేంద్రాలలో ఓటర్లు తమ ఓటును వేసేందుకు బారులు తీరారు. గ్రామ పంచాయితీలలో ఎన్నికల కొలహాలం నెలకొంది. పోలింగ్ కేంద్రాల వద్ద బరిలో ఉన్న అభ్యర్థులు ఓటరును ఆకట్టుకునేందుకు తమ మద్దతుదారులతో పలుకరిస్తు తమకే ఓటు వేయాలని అభ్యర్థించారు. మండలంలోని ఆశ్రమ పాఠశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ రెసెప్షన్ కేంద్రాలతో పాటు వేమనపల్లి, నీల్వాయి, సుంపుటం గ్రామాలలో పోలింగ్ కేంద్రాలను అసిస్టెంట్ డిస్ట్రిక్ట్ ఎలక్షన్ అథారిటీ, ఎంపీడీవో కుమార స్వామి తో కలిసి జిల్లా అదనపు కలెక్టర్ పి. చంద్రయ్య సందర్శించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కుమారస్వామి మాట్లాడుతూ మండలంలో పంచాయితీ ఎన్నికలు పకడ్బందిగా జరిగేందుకు పూర్తి స్థాయిలో చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. ప్రస్తుతం పంచాయితీల్లో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతుండగా ఎన్నికల అనంతరం గెలుపొందిన అభ్యర్థులు పదవీ బాధ్యతలు స్వీకరిస్తారని తెలిపారు. మండలంలో పంచాయితీ ఎన్నికలలో 89.00 శాతం ఓటింగ్ జరిగిందని, అవకతవకలకు అవకాశం లేకుండా పారదర్శకమైన ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. రాత్రి పది గంటల వరకు పూర్తి స్థాయి ఫలితాలు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. వారి వెంట నాయబ్ తహశీల్దార్ మాష్కూర్ అలీ, ఎంపీవో వెంకటేష్ పాల్గొన్నారు.




## వినూత్న రీతిలో భాస్కర్ల శ్రీకాంత్ ప్రచారం

**జైపూర్, డిసెంబర్ 14, ప్రభాతవార్త**



బి.ఆర్.ఎస్ బలపరిచిన టేకుమట్ల సర్పంచ్ అభ్యర్థి భాస్కర్ల శ్రీకాంత్ వినూత్న రీతిలో ప్రచారం చేస్తూ ఓటర్ల దృష్టిని ఆకర్షిస్తున్నాడు. సర్పంచ్‌గా గెలిపిస్తే ప్రభుత్వ నిధులతో పాటు, తన సొంత నిధులు వెచ్చించి సంక్షేమ కార్యక్రమాలు చేపడతానని హామి ఇస్తున్నాడు. ప్రజలు ఆశీర్వదించి, తన ఫుట్ బాల్ గుర్తుకు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. శ్రీకాంత్ ప్రచారంతో, సొంత మెనిఫెస్టోతో ఓటర్లను ఆకట్టుకుంటున్నాడు.

## నర్వ గ్రామ సర్పంచ్‌గా ఆగిడి స్రవంతిని గెలిపించాలి

**జైపూర్, డిసెంబర్ 14, ప్రభాత వార్త**

మంత్రి వివేక్ వెంకటస్వామి, ఎంపీ వంశీకృష్ణ, డిసిసి అధ్యక్షుడు రఘునాథ్‌రెడ్డి లు బలపర్చిన కాంగ్రెస్ అభ్యర్థి ఆగిడి స్రవంతిని నర్వ గ్రామ సర్పంచ్‌గా గెలిపించాలని ఇంఛార్జ్‌లు దుర్గం ప్రభాకర్, ఎర్ర రాజు, బేర వేణు ఓటర్లను కోరారు. ఆదివారం వారు నర్వ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ బలపర్చిన అభ్యర్థి స్రవంతి లింగన్న భారీ మెజారిటీతో గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికి వెళ్లి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంత్రి గడ్డం వివేక్ వెంకట స్వామి ప్రధాన అనుచరుడు ఆగిడి లింగన్న సతీమణి స్రవంతిని గెలిపించి గ్రామాన్ని అభివృద్ధి చేసుకోవాలని కోరారు.





ఒటర్లకు అవగాహన కల్పిస్తున్న సిఐ గురుస్వామి

## ప్రజలు ఎటువంటి ప్రలోభాలకు గురి కావొద్దు: సిఐ

**బజార్‌హత్నూర్, డిసెంబర్ 14, ప్రభాతవార్త:**

మండలంలోని మూడవ విడత సర్పంచ్ ఎన్నికల నేపథ్యంలో భాగంగా ఆదివారం పలు గ్రామాల్లో భోథ్ సిఐ గురుస్వామి ఆధ్వర్యంలో మండలంలోని కొల్హారి, చందునాయక్‌తాండ, దేగామ, బజార్‌హత్నూర్ గ్రామాలలో పోలీసు సిబ్బందితో కవాతు నిర్వహించారు. సిఐ మాట్లాడుతూ రేపటితో ఎన్నికల ప్రచారం ముగియడంతో ప్రజలు ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా సహకరించాలని పేర్కొన్నారు. గ్రామాల్లో పోలీసులు ప్రజలకు అవగాహన కల్పించేందుకు కావాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఎన్నికల్లో ప్రజలు నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. శాంతి భద్రతలకు ఎక్కడ విఘాతం కలగకుండా సామరస్యంగా ప్రజలు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. వీరితో పాటు ఎస్సైలు సంజయ్ కుమార్, శ్రీ సాయి, ఏఎస్సై ప్రేంసింగ్, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.



## ఓటు హక్కును వినియోగించుకున్న రాష్ట్ర కాంగ్రెస్ మహిళా ఉపాధ్యక్షురాలు

**సారంగాపూర్, డిసెంబర్ 14, ప్రభాతవార్త:**

రాష్ట్ర కాంగ్రెస్ మహిళా ఉపాధ్యక్షురాలు అల్లూరి కృష్ణవేణి నిర్మల్ రెండో విడత స్థానిక ఎన్నికలలో భాగంగా తన ఓటు హక్కును తన స్వగ్రామం మాదాపూర్‌లో వినియోగించుకున్నారు. అనంతరం సిద్దిలకుంట, పాక్ పట్ల గ్రామాలలో తమ కాంగ్రెస్ తరపున పోటీ చేసిన అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లను కోరారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉంది కాబట్టి అన్ని పథకాలు మన గ్రామాలలో రావాలి అంటే కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి సర్పంచ్ అభ్యర్థులను గెలిపించుకొని గ్రామాభివృద్ధిని చేసుకోవాలని ఆమె గ్రామ ప్రజలకు కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రాజంపేట సర్పంచ్‌గా ఒక్క అవకాశం కల్పించండి

**ఆసిఫాబాద్, డిసెంబర్ 14, ప్రభాతవార్త:**



రాజంపేట సర్పంచ్ గా మాడావి శ్రీనివాస్ కు ఒక్క అవకాశం కల్పించండని బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షులు ఆవిడపు ప్రణయ్ కుమార్ కోరారు. ఆదివారం ఎన్నికల ప్రచారంలో భాగంగా రాజంపేట లోని పలు వార్డులు తిరుగుతూ ఓటు వేయాలని ప్రజలను కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత మూడు దశాబ్దాలుగా ప్రజాసేవకే జీవితాన్ని అంకితం చేసినటువంటి రాజంపేట సర్పంచ్ అభ్యర్థి మడావి శ్రీనివాస్ ఫుట్బాల్ గుర్తుపై ఓటు వేసి భారీ మెజారిటీ తో గెలిపించాలన్నారు. రాజంపేట గ్రామపంచాయతీ పరిధిలో సర్పంచ్ అభ్యర్థి మడవి శ్రీనివాస్ కలిసితో పర్యటించి ఫుట్బాల్ గుర్తుకు ఓటు వేయాలని ప్రచారం చేశారు. స్థానిక సమస్యలపై అవగాహన ఉన్న వ్యక్తి ప్రజల మనిషి మడవి శ్రీనివాస్ ను గెలిపిస్తే రాజంపేట అభివృద్ధికి కృషి చేస్తారన్నారు. సర్పంచ్ అభ్యర్థి శ్రీనివాస్ మాట్లాడుతు రాజంపేట ప్రజలు ఒక్క అవకాశం ఇవ్వాలని తనని ఆదరించి గెలిపిస్తే అహర్నిశలు అభివృద్ధి కోసం కృషి చేస్తామన్నారు. గెలిచిన వెంటనే స్మశాన వాటిక పనులు పూర్తిచేసే విధంగా కృషి చేస్తామని, డ్రైనేజీలు, అసంపూర్ణంగా ఉన్న రోడ్లు, వీధి దీపాల ఏర్పాటు, ఇతరత్ర అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామన్నారు.